18వ
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం,18 జనవరి 2025


# హక్కులు కాపాడేందుకు భాగస్వాములు కావాలి

**– పిఆర్ జెడి శ్రీదేవి**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** గిరిజన మండలాల్లో నివసించే ప్రజల హక్కులను కాపాడేందుకు "పెసా" చట్టం అమలు చేస్తున్నందున దానిలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ ఎస్ ఐ ఆర్డి జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో రెండు బ్యాచ్‌లుగా ఇచ్చే మాస్టర్ ట్రైనీ ల శిక్షణ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. శిక్షణాకేంద్రం ప్రిన్సిపాల్ జె వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన శిక్షణకు జెడి శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ జె రామానాదంలు పాల్గొన్నారు. తొలుత జెడి జ్యోతి ప్రజ్వలణ చేసి శిక్షణ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన మండలాల్లో ఫిబ్రవరి నెలలో పెసా చట్టం పై ప్రజలకు, అధికారులకు, ఎస్ హెచ్ జి సభ్యులకు, ఎన్ జి ఓ లకు ఈ మాస్టర్ ట్రైనీ ల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 5 జిల్లాలకు సంభందించి 108 మంది అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నట్టు చెప్పారు. కాగా ప్రతి మండలంలో శిక్షణలు ఇచ్చేందుకు 6గురు సభ్యులు ఉంటుందగా వారిలో ఎంపిడివో, ఈఓపిఆర్డి, నలుగులు పంచాయితీ కార్యదర్సులు ఉంటారన్నారు. కాగా రెండో బ్యాచ్ కు ఈనెల 21,22 తేదీల్లో ఈ శిక్షణలు జరగనున్నట్టు తెలిపారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**– ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాల రూపొందించాలి**
**– స్థానిక ప్రజా ప్రతినిధులు సమక్షంలో నిర్వహించాలి**
**– జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** జనవరి 18 నుంచి చేపట్టనున్న స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కార్యాచరణ ప్రణాళిక పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లాలో స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ్ దివస్ కార్యక్రమం అమలు పై మునిసిపల్ పంచాయతి అధికారులకి కలెక్టరు సూచనలను చెయ్యడం జరిగింది. జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి నెలా ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ్ దివస్‌గా పాటించాలని నిర్ణయించిన్నట్లు తెలిపారు. థీమ్‌జి జనవరి, 2025 "కొత్త సంవత్సరం–క్లీన్ స్టార్ట్" ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా "దైవభక్తి పక్కన పరిశుభ్రత" నినాదంతో ప్రతి ఒక్కరిని పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు చేసి బహిరంగంగా చెత్తవేసే అలవాటును అరికట్టడంతో పాటు సామూహిక క్లీనింగ్ డ్రైవ్‌ల ద్వారా చెత్త, చెదరం వంటివి తొలగింపు, పరిసరాల శుభ్రపరచడం శిధిలాల తొలగింపు, బహిరంగ ప్రదేశాలు, బస్టాప్‌లు, మొదలైన వాటిలో మూసుకుపోయిన కాలువలను డ్రైయిన్‌లలో పూడిక తీత



పనులు చేపట్టడం ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కమ్యూనిటీ మరియు పబ్లిక్ టాయిలెట్లను శానిటైజ్ చేయండి వంటి చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తానని ప్రతిజ్ఞ తీసుకుని ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ్ దివస్‌కార్యక్రమాలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ దివస్‌లో భాగంగా గ్రామ, మండల పంచాయతీ స్థాయి అధికారులు తొలగించిన చెత్త రవాణాకు వాహనాలు అవసరమైన యంత్రాలు దాతల సహకారంతో సమకూర్చుకునేలా కృషి చేయాలన్నారు. అవసరమైతే మండలంలోని ఇతర గ్రామ పంచాయితీలకు చెందిన పారిశుధ్య సిబ్బందిని చెత్త కుప్పల తొలగింపు కోసం వినియోగించు కోవాలన్నారు. మిశ్రమ వ్యర్థాలు కలిగిన చెత్త నుండి ఆ ప్రదేశంలో తడి పొడి చెత్తను వేరు చేసి పెద్ద మొత్తంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థ పదార్థాల తో రూపొందించిన ప్రాజెక్టు ప్రదర్శించాలని పేర్కొన్నారు. పారిశుధ్య పని ప్రారంభించే ముందు మరియు పని సమయంలోను చెత్తను తొలగించిన అనంతరం వివిధ కోణాలతో కూడి ఫోటోలు తీసి పిపిటి, డాక్యుమెంటరీ రూపొందించాలన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ్ దివస్ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు , పాఠశాలలలో, స్కూల్స్ ప్రాంగణాలలో నిర్వహించి పచ్చదనం పరిశుభ్రతలో అధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలుతీసుకోవాలని అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఇంఛార్జి జిల్లా గ్రామ పంచాయితీ అధికారి ఎమ్.నాగలత, ఆర్ఎమ్‌సి డిప్యూటి కమీషనర్ ఎస్ వెంకట రమణ,ఆర్ఎమ్‌సి వైద్య అధికారి వి.వినూత్న,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ వన దుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం



**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వనదుర్గ అమ్మవారికి వివిధ రకముల పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వ్రత పురోహితులు అమ్మవారికి శ్రీసూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి, 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం పాల్గొన్న భక్తులకు వేద పండితులు వేద ఆశీర్వచనం గావించగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, ఐ.వి.రామారావు, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించిన ఎఎస్పీ సుబ్బరాజు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రోడ్డు భద్రత మాసోత్సవాలు (16.01.2025 – 15.02.2025) ప్రారంభ కార్యక్రమం శుక్రవారం రాజమహేంద్రవరం డిపోలో జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సుబ్బరాజు (జిల్లా అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్) పాల్గొని ఆర్టీసీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత గూర్చి అవగాహన కల్పిస్తూ పలు సూచనలు సలహాలు అందజేసినారు. ఇంకా ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు (ట్రాఫిక్ డిఎస్పి), కుమారి షర్మిల అశోక (జిల్లా ప్రజా రవాణా అధికారి),షేక్ షబ్నం (రాజమహేంద్రవరం డిపో మేనేజర్), అజయ్ బాబు (రాజమహేంద్రవరం డిపో అసిస్టెంట్ మేనేజర్–ట్రాఫిక్), ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

# జ్యోతిబసు 15వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా సేవలు అందించి చరిత్ర సృష్టించిన సిపిఎం నేత జ్యోతిబసు 15వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఉదయం కాకినాడ సుందరయ్య భవన్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సిపిఎం జిల్లా కమిటీ సీనియర్ నేత దువ్వ శేషబాబ్జీ, నగర కమిటీ సీనియర్ నేత కె.సత్తిరాజులు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన జ్యోతిబసు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. కార్మికుల శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసారని కొనియాడారు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో తొలితరం నేతగా ఉన్న జ్యోతిబసు సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యుడుగా కష్టజీవుల హక్కులకోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా విరామం లేకుండా 23 సంవత్సరాలు పనిచేసిన జ్యోతిబసు భూసంస్కరణలు అమలు చేసారని, పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణ పేదలను పాలనలో భాగస్వాములను చేసారన్నారు. స్వయంగా రైల్వే వర్కర్స్ యూనియన్ స్థాపించి నడిపించారన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి నాయకత్వం వహించి ప్రధాని పదవి చేపట్టాలని ఆనాడు అనేక పార్టీలు జ్యోతిబసును కోరాయన్నారు. పార్టీ నిర్ణయం ప్రకారం ఆయన ప్రధాని పదవి తిరస్కరించారని తెలిపారు. 96 సంవత్సరాలు జీవించిన జ్యోతిబసు దేశ రాజకీయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచారని, ఆయన ఆశయాల బాటలో పయనించాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత తరగతిలో జన్మించిన జ్యోతిబసు కడవరకు కష్టజీవుల పక్షాన నికరంగా నిలబడిన మహానేత అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.ఎస్.శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు మలక వెంకట రమణ, కె.నాగజ్యోతి లతో పాటు మేడిశెట్టి వెంకటరమణ,సిహెచ్.సతీష్, ఎ.ఏడుకొండలు, సిహెచ్.అజయ్, టి.రాజా, రామిరెడ్డి, ప్రసాద్, అదృష్టదీపుడు తదితరులు పాల్గొన్నారు.

## క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణపై ఈనెల 21న ప్రాంతీయ కార్యశాల



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్ వ్యవస్థీకరణపై జనవరి 21న రాజమహేంద్రవరంలో ప్రాంతీయ కార్యశాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి,ప్రశాంతి తెలియ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో క్లస్టర్ స్కూలు కాంప్లెక్స్ సమావేశ ఏర్పాట్లపై కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి సూచనలు జారీ చేస్తూ, ప్రాంతీయ సదస్సు ను పూర్తి స్థాయిలో విజయవంతం చేయడంలో భాగంగా జనవరి 21న కళాకేంద్రంలో నిర్వహించనున్న వర్క్ షాప్ (కార్యశాల)కు తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, డా బి ఆర్ అంబేద్కర్ జిల్లా, రంపచోడవరం రెవిన్యూ డివిజన్ నాలుగు జిల్లాల నుంచి జిల్లా పాఠశాల విద్యాధికారి, సుమారు 25 అసెంబ్లీ నియోజక వర్గాలు క్లస్టర్ ఏరియాలో అన్ని క్షేత్రస్థాయి కార్యదర్శుల మండల పాఠశాల విద్యాధికారులు 1 మరియు 2 , అన్ని రంగాల కార్యదర్శులు పాల్గొననున్న దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్య అతిథి గా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ్ రామ రాజు తోపాటు రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. గ్రూప్ డిస్కషన్ కోసం జిల్లాల వారీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. కార్యశాల అనంతరం గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించి సూచనలను సలహాలను స్వీకరించడం జరుగుతుందని పాఠశాల విద్య ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి . నాగమణి తెలియ చేశారు. మొత్తం ఈ ప్రాంతీయ సదస్సు కు 343 క్లస్టర్ ఏరియాలో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎమ్ ఈ వో లు, డిప్యూటి విద్యా అధికారులు, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లు , క్లస్టర్ ఏరియాలో ఉన్న ఇంటర్మీడియట్, వొకేషనల్ కళాశాల ప్రధానోపాధ్యాయులు తదితరులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 900 మంది పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో లు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా పాఠశాల విద్యాధికారి కె వాసుదేవరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జేవివి సుబ్రహ్మణ్యం, జిల్లా వొకేషనల్ కోర్సు అధికారి ఎన్ ఎస్ వి ఎల్ నరసింహం, ఎస్ఎస్ఎ పిడిఎస్. సుభాషిణి లు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులలో 800 లీ.బెల్లపు ఊట ధ్వంసం



**పెద్దాపురం,మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరి ధిలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని శుక్రవారం గండేపల్లి మం డలంలోని యర్రంపాలెం గ్రామంలో నాటు సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 800 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేసి, కేసు నమోదు చేయడం జరిగిం దని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి .డి. అర్జునరావు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో డిప్యూటి కమీషనర్ ఉత్తర్వుల మేరకు నాటు సారాయి మరియు ఇతర నేరాలలో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేయడం జరిగిందని, అలాగే గత 5 నెలల నుండి నిల్వ ఉంచిన 853 లీ. నాటు సారాయి మరియు 358 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు ప్రసాదరావు, చిట్టిబాబులు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రతినెల మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్"


## కార్యక్రమం ప్రణాళిక ప్రకారం చేపట్టాలి

**– "న్యూ ఇయర్–క్లీన్ స్టార్ట్" అనే ప్రత్యేక అంశంతో ఈ జనవరి నెల స్వచ్ఛ కార్యక్రమాలు అమలు**
**– స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వామ్యులు చేసి స్వచ్ఛత ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం కల్పించాలి**
**– క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్ధేశం చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమం అమలుపై శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ కమిషనర్ భావనతో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్వచ్ఛ కాకినాడ జిల్లా రూపొందించడంలో తీసుకోవాల్సిన చర్యలను జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నెలకు ఒక అంశాన్ని ఎంచుకుని ఈ స్వచ్ఛ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. "న్యూ ఇయర్–క్లీన్ స్టార్ట్" అనే ప్రత్యేక అంశంతో ఈ జనవరి నెల స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్త కుప్పలు తొలగింపు, మురికి కాలువలు ప్రక్షాళన, ప్రజా మరుగుదొడ్లు శుభ్రం చేయడం, ప్రధాన రహదారుల, కూడలి ప్రదేశాల్లోని శుభ్రం చేయడం ఇతర పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర –స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ద్వారా స్వచ్ఛత ప్రాధాన్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యులను చేయాలని ఆయన తెలిపారు. ఈ స్వచ్ఛత కార్యక్రమం ద్వారా నూరు శాతం అశుభ్రమైన ప్రాంతాలు శుభ్రం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే ఈ స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయ ఆవరణం, ఇతర ప్రదేశాలను శుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు.సమావేశంలో జేడ్పీ సీఈవో వీవీవీఎస్.లక్ష్మణరావు, డీపీవో వి రవికుమార్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ భారతి, ఎంహెచ్వో డా.ఎం.పృధ్వీచరణ్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు -ఎస్సై చిన్న బాబు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చిన్న బాబు హెచ్చరించారు. మండలంలోని ఉర్లాకలపాడు గ్రామంలో జడ్డంగి ఎస్ ఐ చిన్న బాబు శుక్రవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, పండించడం అలానే సారాయి కాయడం అమ్మడం వంటివి చేయరాదని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ చిన్న బాబు హెచ్చరించారు. అలానే వ్యవసాయ క్షేత్రాల్లో అనుమతి లేకుండా ఎలక్ట్రికల్ వైర్లు అమర్చడం చేయరాదన్నారు.సోషల్ మధ్యమాల ద్వారా మోసపోవద్దన్నారు. ముఖ్యంగా యువత సారాయి గంజాయి, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు.

# కోర్టు ఆవరణలో అండర్ ట్రయిల్ రివ్యూ

## కమిటీ మీటింగ్ & ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** శుక్రవారం గౌరవ తూర్పు గోదావరి 1వ అధనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివ కుమార్ జిల్లా కోర్టు ఆవరణలో అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ మీటింగ్ మరియు ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిలు/జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కుంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించి, సంబంధిత అదికారులకు తగిన సిఫార్సులు చేశారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయమూర్తి . కె. ప్రకాష్ బాబు, 1 వ అధనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్.కె. జానీ బాష , తూర్పు గోదావరి జిల్లా అడిషనల్ ఎస్.పి ఏ.వి. సుబ్బరాజు, కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్.పి ఎమ్.జె.వి.భాస్కర్ రావు , ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోలీసు అధికారులు, సెంట్రల్ జైలు మరియు ప్రత్యేక మహిళా జైలు అధికారులు, తూర్పు గోదావరి జిల్లా చీఫ్ లీగల్ అయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జె.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సుబ్బాయమ్మ పేటలో గ్రామసభ

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రతి గ్రామంలోనూ అవేర్నెస్ క్యాంపై న్ల ద్వారా ప్రజల్లో వివిధ రకాల సైబర్ మోసాలు, ఇంటి దొంగతనాల నివారణ,బ్యాగ్ లిఫ్టింగ్ నేరాల గురించి, మోటార్ సైకిల్ దొంగ తనాల గురించి, వివిధ రకాల చీటింగు లు ,మహిళా రక్షక్ అవేర్నెస్, డ్రగ్స్ వద్దు బ్రో, రోడ్డు ప్రమాదాల నివారణ ల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించిన మీద గండేపల్లి మండలం సుబ్బాయమ్మ పేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో ఇంటి నేరాలు నివారణ ,డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇంటి దొంగతనాలు మోటార్ సైకిల్ దొంగతనాలు, బ్యాక్ లిఫ్టింగ్ దొంగతనాల నివారణ గురించి, మహిళా రక్షణ అవేర్నెస్ గురించి గ్రామ పెద్ద లందరికీ తెలియజేయడం జరిగింది. అదేవిధంగా రైతులందరూ కూడా ట్రాన్స్ఫారం దొంగతనాలు గురించి అప్రమత్తంగా ఉండి ఏదైనా సమాచారం తెలిసిన పోలీస్ దృష్టికి తీసుకురావలసిందిగా కోరడం జరిగింది . ఈ గ్రామం నుంచి మల్లేపల్లి హైస్కూల్ కి పిల్లలను తీసుకెళ్లే ఆటోల విషయంలో ఎక్కువమంది ఎక్కకుండా, అలాగే సైకిల్ మీద వెళ్లే పిల్లల విషయంలోనూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొండా శ్రీను బాబు ,గొల్లవిల్లి అప్పలరాజు ,కుంచె త్రినాధరావు గొల్లవిల్లి అబ్బాయి ,కర్రి అప్పారావు మరియు మహిళా పోలీసు శివ లక్ష్మి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎస్సై శివ నాగ బాబు జగ్గంపేట సిఐ వైఆర్‌కె పాల్గొన్నారు.

# దంత సమస్యలపై అశ్రద్ధ తగదు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** మన శరీరంలో అత్యంత పటిష్ఠమైన కీలకమైన అవయవాలలో దంతాలు ప్రధానమైనవి అనివాటి సంరక్షణలో నిర్లక్ష్యం తగదని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ సువర్ణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నోటి ఆరోగ్యం మొత్తం శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున నోటిని పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. రోజుకు రెండు పూటలా దంతాలను శుభ్రపరచడంతోబాటు ఏది తిన్నా, తాగినా నీటితో నోటిని పుక్కిలించాలని డాక్టర్ సువర్ణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జనరిక్ ముందులను వినియోగించుకోవాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పేద ప్రజల వైద్య ఖర్చులు తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలని ఫార్మసిస్ట్ శ్రీవాణి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రోగి ఆర్థికంగా నష్టపడి అప్పుల పాలు అవుతున్న దుస్థితి నుంచి కాపాడడానికి ప్రభుత్వం జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేసిందని అన్నారు. కంపెనీ నుంచి నేరుగా జనరిక్ దుకాణాలకు మందులు చేరడంతో ఎలాంటి పన్నులు, కమిషన్లు లేకపోవడంతో తక్కువ ధరలకు అందిస్తున్నారని అన్నారు. జనరిక్ మందుల దుకాణాలలో అమ్మేవి, ప్రైవేట్ దుకాణాలలో లభించేవి ఒకటే నాణ్యత కలవని శ్రీవాణి తెలిపారు. అనంతరం బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్.శ్రీనగేష్, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల గృహాలు సకాలంలో పూర్తి చేయాలి

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని పివిటిజి గిరిజనులకు మంజూరైన గృహాలు సకాలంలో పూర్తిచేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ పథకం ద్వారా పివిటీజీ లకు మంజూరైన గృహాలు సకాలంలో పూర్తి చేసే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన ఇంజనీర్లతో, గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో, ఏడు మండలాలకు సంబంధించిన తాసిల్దార్లతో, ఎంపీడీవోలతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో అన్ని సచివాలయాల పరిధిలో పివీటీజీ లకు మంజూరైన పీఎం జన్మన్ పథకం ద్వారా ఒక్కొక్క మండలంలో అదేవిధంగా సచివాలయ పరిధిలో ఎన్ని గృహాలు మంజూరు అయినవి ఇప్పటివరకు ఎన్ని గృహాలకు పనులు ప్రారంభించింది మండలాల వారీగా, సచివాలయాల వారిగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. టీవీటీజీలకు మంజూరైన గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్ కావాల్సి ఉన్న యెడల పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మంజూరైన గృహాలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు కలిసి జాయింట్ సర్వే నిర్వహించాలని ఆయన అన్నారు. పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహాలకు ఈనెల 30 నాటికి సర్వే పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీలోని అన్ని సచివాలయాలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నది లేనిది ఆయన ఆరా తీశారు. పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహాలు సకాలంలో పూర్తి చేసే విధంగా అన్ని మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందని ఆయన అన్నారు. పీఎం జన్మన్ పథకం పనులు పూర్తి చేసే విధంగా ఒక ప్రొఫార్మ్ తయారుచేసి అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. వై.రామవరం మండలం. మారేడుమిల్లి మండలాల్లో పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన పూర్తిచేసే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టి అదేవిధంగా ఏడు మండలాలకు సంబంధించిన ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తాసిల్దార్లు ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహాలు ఫిబ్రవరి 15 నాటికి అన్ని మండలాల్లో పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. టీవీటీజి గ్రామాలకు సంబంధించిన జన్మన్ పథకం ద్వారా ఏమైనా పెండింగ్లో ఉన్న కరెంటు పనులు అదేవిధంగా త్రాగునీటి పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. అన్ని మండలాల్లోని మారుమూల గ్రామాలలో సెల్ఫోన్ టవర్లు మంజూరైనవి ఎక్కడెక్కడ పనులు జరుగుచున్నవి ఇంకా ఎన్ని పనులు పెండింగ్లో ఉన్నవి తదితర విషయాలు ఆయన ఆరా తీశారు. పీఎం జన్మన్ పథకం గృహాలు సగాలను మంజూరు చేసే విధంగా సంబంధిత అధికారులు సిబ్బంది సంబంధిత అధికారుల అనుమతి లేకుండా సెలవులు పెట్టరాదని ఆయన అన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్మన్ పథకం ద్వారా పివిటిజి లకు మంజూరైన గృహాలకు రెవెన్యూ శాఖ పరంగా నిబంధనల ప్రకారం పొజిషన్ సర్టిఫికెట్లు పరిశీలించి మంజూరు చేయాలని ఆమె అన్నారు. ఈ పథకం పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా సంబంధిత తాసిల్దారులు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పరి శీలిం చాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో తాసిల్దార్లు రామకృష్ణ, సిహెచ్ శ్రీనివాసరావు, ౽. సూర్యనారాయణ, కె.సత్యనారాయణ, వేణుగోపాల్, బాలాజీ, ఎంపీడీవోలు శ్రీనివాసరావు దొర, రత్నకుమారి, యాదగిరి ఈశ్వరరావు, విశ్వనాథ్, ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియేలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, గౌతమి, పి.వెంకటరమణ, సుబ్బారావు, మల్లికార్జునరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నాదెండ్లను కలిసిన కొవ్వూరు జనసేన నాయకులు



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు శుక్రవారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొవ్వూరు జనసేన పార్టీ మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు మాట్లాడుతూ ప్రమాదాల్లో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు జనసేన పార్టీ తరుపున పి.ఎస్.పి చైర్మన్ నాదెండ్ల మనోహర్ 5 లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు ఎటువంటి ఆపద వచ్చిన జనసేన పార్టీ వారి కుటుంబాలను ఆదుకుంటుందని వారి కుటుంబాలకు భరోసాగా ఇస్తుందని తెలియజేశారు. జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు గంగుమళ్ళ స్వామి, కొవ్వూరు మండల ప్రధాన కార్యదర్శి మైగాపుల బాలకృష్ణ, కొవ్వూరు మండల కాపకాయల సతీష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వలన రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని కొవ్వూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.విశ్వం తెలిపారు. జనవరి 11 నుంచి జనవరి 17 వరకు నిర్వహించు ప్రపంచ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పి.విశ్వం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తూ వాహనాలను నడపాలని అన్నారు. ప్రతి వాహనదారుడు ఇంటి నుండి బయటకు వెళ్లి సమయంలో తనకోసం ఎదురుచూస్తున్న తమ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్టిసి డిపో మేనేజర్ వై వి వి ఎన్ కుమార్ ఆర్టిసి సిబ్బంది పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనకు సత్వర చర్యలు చేపట్టాలి

**– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం**





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో పూర్తిస్థాయిలో మలేరియా నిర్మూలించే విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, ఏఎంఓ లు, గ్రామ సచివాలయాల ఎయన్‌యంతో మలేరియా నిర్మూలన, ముందస్తు చర్యలపై ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ సంవత్సరం మలేరియా పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా ప్రతీ గ్రామంలో ఏ కార్యక్రమాలు చేపడతారో ముందస్తు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఫీవర్ కేసులు తగ్గుదలకు డోర్ టు డోర్ సర్వే చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నుండి రంపచోడవరం, కాకినాడ, రాజమండ్రి రిఫరల్ కేసులు ఎయన్‌యం లు ఫాలోఅప్ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వరాలతో వచ్చినవారిని వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి రక్తనమోనాలు సేకరించి జ్వరాలు ఉన్నవారికి మందులు అందజేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలు, ప్రభుత్వ పాఠశాలలు వైద్యాధికారులు పర్యటించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలపై వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ వెయిటింగ్ హాలులకు డెలివర్లకు వచ్చిన గర్భిణీ స్త్రీలకు డెలివరీ అయ్యేవరకు వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓపీలు పెంచాలన్నారు. ఈనెల 20వ తేదీ నుండి కుష్టి వ్యాధి కేసులు గుర్తించేందుకు ఏడు మండలాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎడియంఅండ్ హెచ్ఓ డాక్టర్ శిరీష, రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం ఆసుపత్రులకు సంబంధించిన సూపరింటెం డెంట్ డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ రాహుల్, డాక్టర్ సతీష్, సిడిపివోలు సంధ్యారాణి, లక్ష్మీ ప్రసన్న, లక్ష్మి, ఏఎంఓ రాజు, ఎంపిహెచ్ఓ పీటర్, ప్రాథవిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, ఎయన్‌యంలు పాల్గొన్నారు.

## పెద్దాపురంలో జాతీయ చదరంగ పోటీలు ప్రారంభం

**– పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా, పెద్దాపురంలో గల శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో 13వ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చదరంగం పోటీలు పెద్దాపురంలో నిర్వహించడం గర్వించదగ్గ విషయమని, ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, శ్రీప్రకాష్ విద్యా సంస్థలు అధినేత విజయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. ఈ చదరంగ పోటీలలో దేశంలోని పలు రాష్ట్రాల నుండి చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## రావులపాలెం డిపో నుండి మహా కుంభమేళాకు బస్సు

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రావులపాలెం మరియు పరిసర గ్రామాల భక్తుల సౌకర్యార్థం రావులపాలెం డిపో నుండి మహాశివరాత్రికి కాశీలోని నూతన కాశీ విశ్వేశ్వర మందిరం దర్శనం మరియు మహాకుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమంలో స్నానం చేయు విధంగా సూపర్ లక్సరి బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె.డి.ఎం.ఎస్. కుమార్ తెలియజేశారు. ఈ బస్సు శనివారం బయలుదేరి అరసవెల్లి, పూరీ క్షేత్రము, కోణార్క్, భువనేశ్వర్, జాజిపూర్, గయ, బుద్ధగయ, శిరోగయ, కాశీ క్షేత్రం, సీతామడి, ప్రయాగ, అయోధ్య, నైమిశారణ్యం దేవాలయాల దర్శనం అనంతరం మార్చి నెల మొదటి తారీకునకు రావులపాలెం చేరుకుంటుందని, టికెట్ ధర ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌తో కలిపి రూ.12,800లు అని, ఈ సౌకర్యం భక్తులు వినియోగించుకోవాలని తెలుపుతూ మరిన్ని వివరాలు మరియు టికెట్స్ కొరకు అసిస్టెంట్ మేనేజర్ 7382911871కు సంప్రదించాలని కోరారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట

**– ఎమ్మెల్యే పంతం**
**– ప్రజా పాలనకు అందరు సమిష్టి కృషి అవసరం**
**– వైసీపీ సభ్యులు వాకౌట్ అర్ధరహితం**
**– మండల బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఎంపీడీఓ**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పేర్కొన్నారు. శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం ఇంచార్జి ఎంపీపీ బందిలి విరీష అధ్యక్షతన జరగగా, ఎంపీడీఓ పసుపులేటి సతీష్ 2025-26 అంచనా బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న మండలంలోని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు అజెండా లేని సమావేశం మాకెందుకు అంటూ మధ్యలో వెళ్లిపోగా, మరికొందరు హాజరు కాలేదు. దీంతో మండల సర్వ సభ్య సమావేశం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే పంతం నానాజీ రివ్యూ మీటింగ్‌గా కొనసాగించారు. శాఖలవారీగా గ్రామాల్లో పరిపాలన గురించి తెలుసుకున్నారు. అధికారులు వివరించిన ప్రగతిపై పలు సూచనలు ఎమ్మెల్యే అందించారు. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించాలని కోరారు. దీర్ఘకాలంగా ఉన్న త్రాగునీరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే వేసవి నాటికి అన్ని గ్రామాల్లో మంచినీరు ఇచ్చేలా కృషి చేస్తానని అన్నారు. మంచి పాలన అందించాలని కృషి చేస్తుంటే వైసీపీ సభ్యులు వాటాల కోసం చూస్తున్నారని మండిపడ్డారు. సభ వాకౌట్ చేయడం సభ్యులకు మంచి పద్ధతి కాదన్నారు. కాకినాడ రూరల్ మండలంలో గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కూటమి పాలన ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్టాభివృద్ధి శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కాకినాడ రూరల్ మండలంలో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ పసుపులేటి సతీష్ 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సుబ్బాయమ్మపేటలో అవేర్‌నెస్ క్యాంప్

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రతి గ్రామంలోనూ అవేర్నెస్ క్యాంపైన్లు ద్వారా ప్రజల్లో వివిధ రకాల సైబర్ మోసాలు, ఇంటి దొంగతనాల నివారణ, బ్యాగ్ లిఫ్టింగ్ నేరాల గురించి, మోటార్ సైకిల్ దొంగ తనాల గురించి, వివిధ రకాల చీటింగులు, మహిళా రక్షక్ అవేర్నెస్, డ్రగ్స్ వద్దు బ్రో, రోడ్డు ప్రమాదాల నివారణల మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించిన మీదట శుక్రవారం గండేపల్లి మండలం సుబ్బాయమ్మపేట గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈసభలో ఇంటి నేరాలు నివారణ, డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇంటి దొంగతనాలు మోటార్ సైకిల్ దొంగతనాలు, బ్యాక్ లిఫ్టింగ్ దొంగతనాల నివారణ గురించి, మహిళా రక్షణ అవేర్నెస్ గురించి గ్రామ పెద్దలందరికీ తెలియజేయడం జరిగింది. అదేవిధంగా రైతులందరూ కూడా ట్రాన్స్‌ఫారం దొంగతనాలు గురించి అప్రమత్తంగా ఉండి ఏదైనా సమాచారం తెలిసిన పోలీస్ దృష్టికి తీసుకురావలసిందిగా కోరడం జరిగింది. ఈ గ్రామం నుంచి మల్లేపల్లి హైస్కూల్‌కి పిల్లలను తీసుకెళ్లే ఆటోల విషయంలో ఎక్కువమంది ఎక్కకుండా, అలాగే సైకిల్ మీద వెళ్లే పిల్లల విషయంలోనూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొండా శ్రీనుబాబు, గొల్లవిల్లి అప్పలరాజు, కుంచె త్రినాధరావు, గొల్లవిల్లి అబ్బాయి, కర్రి అప్పారావు మరియు మహిళా పోలీసు శివలక్ష్మి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, జగ్గంపేట సిఐ వైఆర్‌కె పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి ప్రాకార మండపంలో ప్రత్యేక వేదికపై జన్మ నక్షత్రం మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం స్వర్ణ, రజతాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అమ్మవారి పారాయణం చేసిన మహిళా భక్తులకు, ఇతర భక్తులకు దేవస్థాన ఆధ్వర్యంలో తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆసాదులు, సిబ్బంది ఎస్.వెంకటరమణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్‌సి సంక్రాంతి సంబరాల్లో ఘర్షణ

**– పోలీస్‌లు లాఠీఛార్జ్, ఒక వ్యక్తికి గాయాలు**





**రావులపాలెం, మేజర్ న్యూస్ :** సామజిక సేవే ధ్యేయంగా ఏర్పాటు చేసి, సాంస్కృతిక సేవ, సామజిక సేవ కార్యక్రమాలతో పేరెన్నికగన్న రావులపాలెం సిఆర్‌సి...సంక్రాంతి సంబరాలు పేరుతో పోతంశెట్టి రామిరెడ్డి పార్క్‌లో ఏర్పాటు చేసిన సంబరాల్లో గురువారం రాత్రి తీవ్ర దుమారం లేచింది. ప్రతి రోజు సాయంత్రం 6గంటల నుండి రాత్రి 11గంటల వరకు జరుగుతున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమంలో సినీ స్టేజి షోలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలను వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ ఎత్తున ప్రజలు వచ్చి చూసి ఆనందిస్తున్నారు. వచ్చే జనాభాను దృష్టిలో పెట్టుకుని పోలీస్‌లు భద్రత కల్పించడంలో విఫలం అయ్యారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఐతే సంబరాల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన బౌన్సర్ లు కూడా ప్రజల పట్ల నిర్లక్ష్యంగా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు కూడా తీవ్రంగా ఉన్నాయి. ఇదే కోవలో నిన్న రాత్రి కొందరు యువకుల తమకు కావాల్సిన పాటలు పెట్టలేదు అని అల్లరి చేసారని, తద్వారా ఆ అల్లరి కాస్త బౌన్సర్‌లకు, యువకుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడి శాంతిభద్రతలు గతి తప్పగా, పోలీస్‌లు సమాచారం అందుకొని హుటాహుటిని పార్క్ వద్దకు చేరుకొని తమ లాఠీలకు పని చెప్పగా ఒక వ్యక్తికి గాయాలయ్యని తెలుసింది. ఐతే ఏమి జరిగింది అని దానిపై పోలీస్‌లు వివరణ ఇవ్వలేదు.

**ముమ్మిడివరం నగర పంచాయితీ**

ఆర్.ఒ.సి. నెం: 175/2024/ఇ1 తేది. 17.01.2025

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

ముమ్మిడివరం నగర పంచాయితీ, ఇంజనీరింగు విభాగమునకు సంబంధించి సాధారణ నిధులతో 2 పనులకు రూ.6.30 లక్షల అంచనాలతో ఇప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండర్లు పిలువబడినవి.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ :
18-01-2025 ఉదయం గం॥ 11.00ల నుండి.

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేదీ :
22-01-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు.

బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేదీ :
22-01-2025 సాయంత్రం గం॥ 4.00ల వరకు

మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పనివేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.

సం.// పి.రవివర్మ,
కమిషనరు,
ముమ్మిడివరం నగర పంచాయితీ



# ఆయన మార్గమే ఆదర్శం

**- జ్యోతి బసు 15వ వర్ధంతి నివాళి**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య పోరాట యోధుడు, సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యులు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతి బసు మార్గమే మనందరికి ఆదర్శమని సిపిఎం నాయకులు సిరపురపు శ్రీనివాస్ అన్నారు. జ్యోతి బసు 15వ వర్ధంతి సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ అధ్యక్షతన శుక్రవారం యాసలపు సూర్యారావు భవనంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు జ్యోతి బసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డి.సత్యనారాయణ, డి.కృష్ణ, చల్లా విశ్వనాధం, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అరుణ, గడిగట్ల సత్తిబాబు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 12వ చతుర్థి మాసోత్సవం

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** పుష్యమాస వక్రతుండ సంకష్ట హర చతుర్థి సందర్భంగా కాకినాడ భోగిగణపతి పీఠంలో 12వ చతుర్థి మాసోత్సవం వైభవంగా జరిగింది. సుప్రభాత వేళలో 30మంది చతుర్థి ఉపవాసకులు సిద్ధి బుద్ధి సమేతంగా బాలగణపతి విగ్రహాన్ని మంగళ వాయిద్యాలతో ఊరేగించి నగర సంకీర్తన చేశారు. యాపిల్ పుష్పాలతో పాలవెల్లిని అలంకరించి పసుపు కొమ్ములతో గణేశుని పూజించారు. చంద్రోదయ వేళ లక్ష వత్తుల హారతి అర్ఘ్యం ఉపవాస దీక్షలు విరమించిన ఆరాధకులకు అల్పాహారం పసుపు కుంకుమ రవిక గాజులు ప్రదానం జరుగుతుంది. భోగి రోజున గణపతిని అభిషేకించిన ధాన్యాన్ని భక్తులకు అందజేస్తున్నారు. వాటిని మట్టిలో నాటి అంకురించిన నారును నిత్య గరిక పూజకు అందించాలని కోరారు. స్వయంగా గరికను సమర్పించడం ఉత్కృష్ట వైభవమని పీఠం తెలియజేసింది.

# 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఈ నెల 26న కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఆయన.. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ ఉదయం 9.గం.లకు కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్ లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఈగణతంత్రదినోత్సవ వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందోబస్తుతో పాటు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈవేడుకలకు హాజరయ్యే ప్రముఖులతో పాటు ప్రతిఒక్కరికీ తగిన సీటింగ్ ఏర్పాట్లు, ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ పేరేడ్



ప్రాంగణంలో తగిన త్రాగునీటి వసతి, పారిశుధ్య నిర్వహణ, భారీ కేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. తొలుత డీఆర్వో జె.వెంకటరావు వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరించారు. వాటిలో ముఖ్యంగా పోలీస్‌శాఖ తరపున పోలీస్ పేరేడ్ గ్రౌండ్ లోపల వెలుపల చేపట్టవలసిన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ముఖ్య అతిథి వారి గణతంత్ర దినోత్సవ సందేశం తయారీ మరియు ప్రచురణతో పాటు సరిపడిన ప్రతులు సిద్ధం చేసి అందరికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అదేవిధంగా పటిష్టమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం, మీడియా లైవ్ కవరేజ్ కి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రధాన వేదిక అలంకరణ ఇతర ఏర్పాట్లు సహా స్టేడియంలో ఇతర వసతులపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్, కాకినాడ రూరల్ తహసీల్దార్ లను ఆదేశించారు.

వివిధ శాఖలవారీగా చేయాల్సిన ఏర్పాట్లపై సకాలంలో తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ 20 సంవత్సరాల వయసులో విజయ నగర సామ్రాజ్య సింహాసనాన్ని అధిష్టించిన శ్రీకృష్ణదేవరాయలు ఆ రాజ్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లారని అన్నారు. ఆంధ్రభోజుడుగా కీర్తింపబడిన కృష్ణదేవరాయలు గొప్ప రాజ్యనీతిజ్ఞుడు, భుజబల సంపన్నుడు, ఆర్థికవేత్త, కవి పోషకుడు, మతసహనం కలవాడని అన్నారు. వైష్ణవుడైనా పరమత సహనాన్ని చూపారని అన్నారు. తెలుగు, కన్నడ ప్రజలు భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో కృష్ణదేవరాయులు ఒకరిగా అభిమానిస్తారని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నేడు స్వచ్ఛత దివాస్ కార్యక్రమం

**- ఎంపిడిఓ శ్రీలలిత**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛత దివాస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఎంపిడిఓ డి.శ్రీలలిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ప్రతీ నెల 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడంలో భాగంగా ఉదయం 7 గంటలకు ప్రతిజ్ఞ, తదుపరి మండల కార్యాలయాల పరిసర ప్రాంతాలలో జంగిల్ క్లియరెన్స్, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాల నిర్వహణ, గ్రామాలలో డ్రైన్ల క్లినింగ్, చెత్తకుప్పలు తొలగించుట, జంగిల్ క్లియరెన్స్, పల్లపు ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని తొలగించుట, శుభ్రపరచుట, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్ధులతో కలసి, స్వచ్ఛత దివాస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ శ్రీలలిత తెలిపారు.

# ఎస్.యానాంలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరం..!

**- సూరసాన యానాం బీచ్‌లో నాలుగురోజుల పాటు ఉత్సవం..**

**- పర్యాటక అభివృద్ధికి చక్కని వేదిక: మంత్రి కందుల దుర్గేష్ - ఆంధ్రాగోవాగా తీర్చిదిద్దుతా..: ఎమ్మెల్యే ఆనందరావు..**





**అమలాపురం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరం అంబరాన్నంటింది.. నాలుగురోజుల పాటు ఆంధ్రాగోవా బీచ్ దద్దరిల్లింది.. వేలాది మంది ప్రజలు తరలివచ్చి ఉత్సాహంగా గడిపారు.. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సూరసాయన యానాం బీచ్‌లో నాలుగు రోజుల పాటు సంబంరం ఉత్సాహంగా సాగింది.. అమలాపురం ఎమ్మెల్యేఅయితాబత్తుల ఆనందరావు సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ నాలుగు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్నాయి.. చివరిరోజైన గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా యానాం బీచ్‌లో ఏర్పాటు చేసిన సాండ్ బైక్‌లపై మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తదితర నాయకులు ఉత్సాహంగా గడిపారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ వైట్ సాండ్‌తో నిండి ఉండే సూరసానయానాం బీచ్ పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. పర్యాటక రంగానికి అత్యంత అనువైన ప్రాంతంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి దిశగా ప్రయత్నిస్తానని తెలిపారు. అంతేకాకుండా తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆనందరావుకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ సూరసాన యానాం పర్యాటకంగా మంచి అనువైన ప్రాంతమని, లక్షలాది మంది నాలుగురోజుల సంబరాలను తిలకించేందుకు విచ్చేశారని, తొలి ప్రయత్నంలోనే ఇంతటి ఘన విజయం అందించిన అమలాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేఏడాదికి ఎస్.యానాంలో మరింత ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా బీచ్‌లో రిసార్ట్స్, ఇంకా బోట్ షికార్ తదితర ఏర్పాట్లుపై దృష్టిసారించి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం మంత్రి దుర్గేష్‌తోపాటు రాజకీయ, సినీ ప్రముఖులకు ఘన సన్మానం చేశారు.

సందడి చేసిన సెలబ్రిటీలు..సూరసాన యానం బీచ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో సినీ, రాజకీయ ప్రముఖులు సందడి చేశారు. ప్రముఖ హీరోయిన్లు కామ్నజెఠ్మలానీ, హెబ్బా పటేల్‌తోపాటు టీవీ సీరియల్ నటీనటులు, జబర్దస్త్ అభి, నూకరాజు, వినోద్ తదితర తారాగణం సందడి చేశారు. ఆఖరి రోజున ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కుంచె రఘు ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. నాలుగు రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు శుక్రవారం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులందరూ సంఘటితంగా ఉండి అభివృద్ధి పథంలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రామానుజన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, ఉమ్మడి జిల్లా నాయకులు అద్దంకి వెంకన్న బాబు, కాకినాడ నగర అధ్యక్షులు చోడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంగాడి రాజసింహ వర్మ, జాయింట్ సెక్రటరీ ములంపాక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రాపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డేటాఎంట్రీ రీ సర్వేను సమర్థ వంతంగా నిర్వహించాలి: శిక్షణలో ఆర్డివో శ్రీ రమణి



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఎవరి భూములు వారికే దక్కే విధంగా రీ సర్వే అప్డేట్, డేటా ఎంట్రీ ప్రక్రియను సమర్ధ వంతంగా నిర్వహించాలని పెద్దాపురం ఆర్డివో కె శ్రీ రమణి అన్నారు. సామర్లకోట జిల్లా మహిళా సాధికార సంస్థ అయిన టిటిడిసి శిక్షణా కేంద్రంలో డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన మండల సర్వేయర్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డివో శ్రీ రమణి మాట్లాడుతూ భూ సమస్యలకు సంభందించి ఎలాంటి ఇబ్బందులు నమోదైనా వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. దానికి సంభందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సూచనలు అందించినందున వాటిని అనుసరించి గ్రామాల్లో రైతులకు సేవలనందించాలన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే, డేటా ఎంట్రీ పై పలువురు మండల స్థాయి అధికారులకు పలు విషయాలు వివరించారు.

# జవాబుదారీతనంతో రెవెన్యూ సేవలు ఉండాలి

**- కలెక్టర్ పి.ప్రశాంతి**




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్:** రెవిన్యూ సేవలు అందించే క్రమంలో జవాబు దారీతనం కలిగి ఉండేలా చూసుకోవాలనీ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవిన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, డిఆర్వో టి సీతారామ మూర్తి,కలక్టరేట్ ఏవోఎమ్ డి.ఆలీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం లో భాగంగా ఎక్కువ మొత్తంలో రెవిన్యూ పరమైన అంశాలపై అర్జీలను స్వీకరించడం, పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాల్సింది ఉందన్నారు. వీటిలో ఎక్కువగా ఐదు కేటగురిలకి చెందిన అర్జీలు ఉన్నాయని వాటిలో మ్యుటేషన్లపై రెవెన్యూ ఫిర్యాదులు : 1079 , రెవెన్యూ రికార్డులలో నమోదుల ఆదాయ సవరణ-879 , ఎస్ఎల్ ఏ సర్టిఫికేట్లు (రెవెన్యూ) 835, ఆర్ వో ఆర్ డేటాలో దిద్దుబాట్ల కోసం రెవెన్యూ అభ్యర్థన -334,రెవెన్యూ ఉద్యోగుల సేవా సమస్యలు ఇంక్రిమెంట్ల మంజూరు /ప్రమోషన్ కోసం అభ్యర్థన/మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు కోసం అభ్యర్థన - 319 ఉన్నాయని పేర్కొన్నారు. పలు అర్జీలు పరిష్కరం కొరకు తిరిగి తెరవడం జరిగిందని వాటిలో రెవెన్యూ రికార్డులలో రెవెన్యూ సవరణల నమోదులు-15 , ఉద్యోగులపై ఫిర్యాదుదారులు - 12, సర్టిఫికెట్ల జారీ జాప్యం 7 ,సేకరించిన భూమికి పరిహారం చెల్లించకపోవడం-8 భూసేకరణపై చర్య -7 ఉన్నాయన్నారు. రెవిన్యూ డివిజన్ అధికారి ప్రతి రోజు కనీసం ఒకసారైనా తహసిల్దార్ వారీగా అర్జీల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలు పై సమీక్ష నిర్వహించాలన్నారు. సీఎంవో , మంత్రులు, రాష్ట్ర స్థాయిలో వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార విధానం లో రెవెన్యు అధికారులు పాత్ర కీలకం అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, సమస్య పరిష్కారం కోసం వొచ్చే వారిలో ఎక్కువ మంది పెద్ద వారు రావడం జరుగుతుందని, వారితో ఆప్యాయత తో కూడి వ్యవహరించడం వల్ల సమస్య తీవ్రత తగ్గడం తో పాటు పరిపాలన యంత్రాగంపై గౌరవం కలిగే అవకాశం ఉంటుందన్నారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం కల్పించడం లో క్షేత్ర స్థాయిలో తహసీల్దార్లు వ్యవహరించే తీరు ముఖ్యం అన్నారు. ఆర్డీవో అధ్వర్యంలో మండల వారీగా ఫిర్యాదులు పరిష్కార విధానం పై ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి, ఆర్డీవో లు ఆర్ కృష్ణ నాయక్ , రాణి సుస్మిత, ఏవో ఆలీ, తహశీల్దార్లు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీ ప్రకటనపై మల్లాడి హర్షం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై జనసేన నాయకులు మల్లాడి రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నష్టాల నుండి పునరుద్ధరణ ప్యాకేజీ కింద కేంద్రం రూ.11,440 కోట్లు కేటాయించిందని ఇందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకటన వేలాదిమంది కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతుందన్నారు. దీనికోసం కేంద్ర మంత్రులు కుమారస్వామి, నిర్మల సీతారామన్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి స్థాయిలో నిలదొక్కుకునేందుకు లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టుకోవడం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసి తెలుగు ప్రజల ఆత్మగౌరవం అయిన స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు పాటుపడిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్,మంత్రిలోకేష్ లకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శృంగవృక్షంలో గుర్తు తెలియని మృతదేహం

**పాలకోడేరు మేజర్ న్యూస్,** శృంగావృక్షం గ్రామంలోని ఎఫ్ సిఐ రోడ్‌లో గల పంట బోదే లో గుర్తు తెలియని మృత దేహాన్ని కనుగొన్నారు. తనకు అందిన సమాచారం మేరకు అక్కడకు వెళ్ళి చూడగా సుమారు 50-55 సంవత్సరాల వయసు గల పురుషుని మృత దేహం పంట బోధే లోని నీటిలో బోర్లా పడి వుందని శృంగవృక్షాం విఆర్వో 2 దేవదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రవి వర్మ తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు వెంటనే పాలకోడేరు పోలీసులకు తెలియ జేయాలని తెలిపారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో హెల్మెట్‌లు అందజేత



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాదికారసంస్థ ఆదేశాల మేరకు ,నర్సాపురం మండల న్యాయ సేవాధికారా సంస్థ ఛైర్ పర్సన్,10వ అధనపు జిల్లా న్యాయమూర్తి పి. విజయ దుర్గ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా సౌజన్యంతో శుక్రవారంస్థానిక కళ్యాణి రూరల్ రిహాబిలిటేషన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కి చెందిన మౌనిక గౌరీకి బ్రెయిలీ కిట్‌ను అందించారు.

శిరస్త్రాణం లేనివారిని గుర్తించి నాలుగురికి శిరస్త్రాణాలను అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ జ్యోతిర్మయి, కళ్యాణి స్పెషల్ టీచింగ్ సెంటర్ కరస్పాండెంట్ ఎ.నళిని దేవి తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

**భద్రత మాసోత్సవాలు సందర్భంగా డిటిసి పిలుపు.**



**కాకినాడ :** హెల్మెట్ ధరించి తమ అమూల్యమైన ప్రాణాలు కాపాడుకోవాలని కాకినాడ జిల్లా రోడ్డు ట్రాన్స్పోర్ట్ ఉప శాఖాధికారి కె శ్రీధర్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక ఆర్టీవో ఆఫీసులో వివిధ ఆటో సంఘాల, ఇతర వాహనాల సంఘాల నాయకులతో రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారులు సమావేశం అయ్యారు ఈ సందర్భంగా డిటిసి మాట్లాడుతూ 2024 లో రోడ్ ప్రమాదృశ్య 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని వారిలో చాలా మంది ధరించకపోవడం ముఖ్య కారణం అని తెలిపారు అలాగే వాహనదారులు రావణా గార్లు తమ ప్రయాణం సుగమముగా జరిగే విధముగా అన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు నాలుగు చక్రాల వాహన డ్రైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్టు ధరించాలని అలాగే ద్విచక్ర వాహదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని కోరారు ప్రభుత్వం ఎన్ని రకాలు చర్యలు తీసుకుంటున్న సరే వీరు సరైన డ్రైవింగ్ రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు అలాగే ఆటోలో ముగ్గురు కన్నా ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదని స్కూల్ ఆటోలు ఆరుగురు విద్యార్థులు మించి ఎక్కించుకోకూడదని తెలిపారు ప్రయాణ రక్షణ చర్యలు తీసుకొని వాహదారులపై ప్రభుత్వ ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని తగిన కట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అలాగే హిట్ అండ్ డ్రైవ్ కేసుల్లో మరణించిన వారికి ప్రభుత్వం నియమ నిబంధనలు ప్రకారము ఎప్పటికీ చాలామందికి ఆర్థిక సహాయం ఆర్థిక సహాయం అందించామని గుర్తుచేశారు . వాహదారులు డ్రైవర్లు ఇతరులు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మురళీకృష్ణ డాక్టర్ పద్మావతి రమణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీడీఏ పీవోగా శ్రీరాములు నాయక్ బాధ్యతలు స్వీకారం



**బుట్టాయిగూడెం, మేజర్ న్యూస్:** ఐటీడీఏ పీవోగా కె.రాములు నాయక్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. కృష్ణాజిల్లా సర్వ శిక్ష అభియాన్‌లో ఉన్నతాధికారిక పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఐటీడీఏ పీవోగా జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. ఆమె 2024 ఆగస్టు 15 బాధ్యతలు చేపట్టి ఇప్పటివరకు పిఓగా బాధ్యతలు నిర్వహించారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాములు నాయక్ శాసనసభ్యులు చిర్రి బాలరాజుని,రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.